క్లుప్తంగా

వైభవంగా ఉరుసు

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో కాశీంతాత ఉరుసు ఉత్సవాలలో భాగంగా ఆదివారం గంధం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి గంధం పెట్టెను తలపై పెట్టుకొని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. నిర్వాహకులు, గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో ధర్నా

గోనెగండ్ల: మండల కేంద్రంలో ఒక సామాజిక వర్గానికి చెందిన రుద్రభూమిని మరో వర్గం వారు ఆక్రమించి ప్రార్థన మందిరం నిర్మించారని నిరసిస్తు ఆదివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదరిపై భజరంగ్‌దళ్, విశ్వ హిందు పరిషత్ నాయకులు ధర్నా నిర్వహించారు. రుద్రభూమి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆదివారం చలో గోనెగండ్ల కార్యక్రమం నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలో భాగంగా పోలీసులు గోనెగండ్లకు చెందిన ఆ సంఘం నాయకులను అరెస్టు చేశారు. అయితే ఆదివారం గోనెగండ్లలో పలువురు నాయకులు ధర్నా చేపట్టారు. సీఐ మోహన్ రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని ధర్నా చేస్తున్న వారిని అరెస్టు చేశారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నాడు- నేడు పనుల పరిశీలన



నందవరంలోని కేజీబీవీలో పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మన బడి నాడు- నేడు ఫేజ్-2 పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నామని పీఆర్ ఏఈ జయన్న పేర్కొన్నారు. ఆయన ఆదివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో స్లాబ్ నాణ్యతను పర్యవేక్షించామన్నారు. ఈ విద్యాలయానికి ప్రభుత్వం అదనంగా 8 గదులు మంజూరు చేసిందని, ఒక్కొ గది రూ.12 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాలుగు గదులకు స్లాబ్ పనులు పూర్తయినట్లు తెలిపారు. కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

మాన్వి జట్టు విజయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో మాన్వి జట్టు గెలుపొందింది. హనుమాపురం జట్టుపై గెలుపొందిన మాన్వి జట్టుకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మొమెంటోను మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప అందజేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ఎమ్మిగనూరుటౌన్: వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండటం అవసరమని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాష పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొనే వస్తువుల నాణ్యత లోపం, సేవలలో అసమర్థత, లోపాలకు వ్యతిరేకంగా వినియోగదారులు న్యాయం కోసం వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చని సూచించారు. అధ్యాపకులు బలరాముడు, రాజశేఖర్, తిప్పేస్వామి, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో త్రోబాల్ క్రీడా పోటీలు జరిగాయి. మండల విద్యాధికారి బి.శివరాములు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. త్రోబాల్ పోటీల్లో 8 గ్రూపులు పాల్గొన్నాయని చెప్పారు. నేషనల్ పాఠశాల మొదటి బహుమతి గెలుచుకోగా రెండో బహుమతి ఆర్ఆర్ లెబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను నిర్వహించడానికి సహకరించిన వ్యాయమ ఉపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు మధుసుదన్ రావు, అబిదబేగం, ఇందిర ప్రియాంక, రాజ్యలక్ష్మి, నాగేష్, వీరచంద్ర యాదవ్, శ్రీరాములను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నకుల రాజు, వైస్ చైర్మన్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం



కృష్ణగిరి మోడల్‌స్కూల్ సమీపంలో ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్ సంప్



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, నాయకులు (ఫైల్)

- వెల్దుర్తి వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి నీటిని తరలించి ఫిల్టర్ చేసి సరఫరా
- ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా మంచినీరు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలో నాలుగేళ్ల క్రితం వరకు తాగునీటి సమస్య నిరంతరంగా ఉండేది. ఏడాది పాటూ ఇక్కడి ప్రజలు గుక్కెడు నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. వారం నుంచి పదిరోజులకోసారి వచ్చే నీటి కోసం వీధుల్లో యుద్ధాలు జరిగేవి. దశాబ్దాల కాలంగా పాలకులు ఇక్కడి ప్రజల గోడు పట్టించుకోలేదు. గత టీడీపీ హయాంలో ఇక్కడి నుంచి డిప్యూటీ సీఎంగా పదవి అలంకరించిన వారు సైతం తాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేదు. చేసేదిలేక పదిరోజులకోసారి వచ్చే నీటినే పట్టుకుని జనం కాలం వెల్లదీశారు. 2019 ఎన్నికల సమయంలో పట్టణ ప్రజలంతా తాగునీటి సమస్య పరిష్కరించే వారికే ఓటు వేయాలని నిర్ణయించుకోగా పత్తికొండ నుంచి వైఎస్సార్‌సీపీ బరిలో నిలిచిన కంగాటి శ్రీదేవి ప్రజల కష్టాలు తప్పక నెరవేరుస్తానని మాట ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. రెండేళ్లకే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల గుండెల్లో నిలిచారు.

→ హంద్రీ – నీవా నీటి సరఫరా

వెల్దుర్తి పట్టణంలో దాదాపు 4 వేల కుటుంబాలు ఉన్నాయి. 20 వేల మంది జనాభా ఉన్నారు. అధికారుల లెక్కల ప్రకారం వీరికి రోజు అవసరాలకు 17 లక్షల లీటర్ల నీరు కావాలి. అయితే బ్రహ్మగుండం, చెరుకులపాడు, తొగర్చేడు వనరుల ద్వారా కేవలం 7 లక్షల లీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉండడంతో పదిరోజులకోసారి నీరు వచ్చేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటిని అందించేలా ప్రణాళికతో ముందుకెళ్లారు. కృష్ణగిరి వద్ద ఉన్న హంద్రీ – నీవా రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే సమస్యకు పరిష్కారం చూపవచ్చని గుర్తించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.3.10 కోట్లు మంజూరు చేసింది. వెంటనే పనులు ప్రారంభి ఏడాది లోగా పూర్తి చేసి 2021 సెప్టెంబర్ 16న పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంతోపాటు తొగర్చేడు, చెరుకులపాడు, బ్రహ్మగుండం వద్ద బోర్లు వేయించి అక్కడి నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో పట్టణ వాసులకు పుష్కలంగా తాగునీరు అందుతోంది.

→ పథకం ఏర్పాటు, సరఫరా విధానం

కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి వెల్దుర్తికి సురక్షిత తాగునీరు (ఫిల్టర్) అందించే పథకాన్ని ఎస్ఆర్‌డీడబ్ల్యూపీ (జాతీయ గ్రామీణ తాగునీటి పథకం)- జేజేఎం(జల జీవన్ మిషన్) నిధులతో ఏర్పాటు చేశారు. కృష్ణగిరి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటెక్ వెల్ నుంచి 25 హెచ్‌పీ మోటార్ల ద్వారా మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్‌లకు నీరు చేరుతుంది. అక్కడ ఫిల్టర్ అయిన నీటిని పక్కనే ఉన్న 2 లక్షల లీటర్ల కెపాసిటీగల సంప్‌లోకి చేరి అక్కడి నుంచి 11 కి.మీ దూరంలో వెల్దుర్తిలోని డోన్ వైపు వెళ్లే రైల్వే గేట్ల వద్ద ఉన్న 4 లక్షల లీటర్ల కెపాసిటీ గల సంప్‌లోకి 9 ఇంచ్‌ల పైపు ద్వారా ప్రతి రోజు 16 లక్షల లీటర్ల ఫిల్టర్ నీరు సరఫరా అవుతుంది. ఇక్కడి నుంచి నీరు గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు, కుళాయిల ద్వారా ఇంటింటికీ నిత్యం సరఫరా అవుతుంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు సీఎం వైఎస్ జగనన్న, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిష్కారం చూపడంతో పట్టణవాసులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గతంలో బోర్ల వద్దకెళ్లి నీరు తెచ్చుకునేవాళ్లం



గతంలో 10 రోజులకోసారి నీరు వచ్చేవి. గంటల తరబడి వేచిఉండి నీటిని పట్టుకునే వాళ్లం. ఒక్కోసారి మా వారు ఎద్దుల బండిపై వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని పట్టుకొచ్చిన సందర్భాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి తాగునీటి పథకం ప్రారంభించడంతో ప్రస్తుతం నీటి కష్టాలు తొలగిపోయాయి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రోజూ నీటిని సరఫరా చేస్తున్నారు. మా కష్టానికి ఈ ప్రభుత్వం తగిన పరిష్కారం చూపింది.

– కృష్ణవేణి, 5వ వార్డు, వెల్దుర్తి

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే..



గత పాలకులు వెల్దుర్తి ప్రజల తాగునీటి కష్టాల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కినా కనికరించలేదు. ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవి గెలుపొందిన వెంటనే అధికారులతో చర్చించి నివేదికలు తయారుచేసి సీఎం వైఎస్ జగనన్న దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. ఏడాదికే పనులు పూర్తి చేసి నీరు సరఫరా చేస్తుండటంతో మహిళల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

– బొమ్మన రవిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వెల్దుర్తి

గుక్కెడు నీరివ్వని వారు అభివృద్ధి గురించి మాట్లాడతారా?



ఎన్నో ఏళ్లుగా వెల్దుర్తి పట్టణ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. గత పాలకులు ఇక్కడి ప్రజలను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకున్నారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా ప్రజలకు గుక్కెడు తాగునీరు అందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లకే రూ.3.10 కోట్లతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. ప్రజలకు గుక్కెడు నీళ్లివ్వని ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి లేదని చెప్పడం సిగ్గుచేటు.

– ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పత్తికొండ నియోజకవర్గం

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



హీరమఠం మహేష్ (ఫైల్)

నందవరం: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు హీరమఠం మహేష్ (56) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. నాలుగు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురై ఎమ్మిగనూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక ఆదివారం వేకువజామున మృతి చెందాడు. ఆయన మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ తోట సావిత్రి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: స్థానిక మారుతి నగర్‌లో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఆలూరుకు చెందిన రవీంద్రరావు దంపతులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బంధువుల ఊరికి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో వారి బంధువులు, చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఇంటి యజమాని వచ్చి ఫిర్యాదు చేస్తే దొంగలు ఏమి ఎత్తుకెళ్లారో తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

షేర్ క్యాపిటల్ చెల్లించండి

మద్దికెర: మండలంలోని మద్దికెర, బురుజల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతులు షేర్ క్యాపిటల్ చెల్లించి తమ సభ్యత్వాన్ని కొనసాగించుకోవాలని చైర్మన్లు శాంతన్న, సుబ్బయ్య ఆదివారం తెలిపారు. సహకార సంఘంలో గతంలో సభ్యత్వం ఉండి రూ.300 కన్నా మూలధనం తక్కువగా ఉన్న రైతులందరూ ప్రకటన వెలువడిన నాటినుండి 15 రోజుల్లోగా మూలధనం చెల్లించి తమ సభ్యత్వాన్ని కొనసాగించుకోవాలన్నారు. సంఘంలో సభ్యత్వం కలిగిఉండడం వల్ల ప్రభుత్వం కల్పించే సబ్సిడీ రుణాలు, పంట నష్ట పరిహారం పొందే అవకాశం అవకాశం ఉంటుందన్నారు. సభ్యత్వం కొనసాగించుకోవాలనుకునే వారు ఫొటో, ఆధార్‌కార్డు, సంఘం ఐడీ కార్డు, పొలం పాస్‌బుక్ తీసుకొని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

మద్దికెర: మండలంలోని గ్రామాలలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ప్రభుత్వం కేటాయించిన గడువు ఈ నెల 31వ తేదీ లోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ రవి సూచించారు. రైతులు ఆర్బీకేల్లో వ్యవసాయాధికారులను సంప్రదించి పంటల వివరాలను తెలియజేసి ఈ-కేవైసీ నమోదు చేయించడమే గాకుండా ఆధార్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ ప్రతులను అందజేయాలన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు



జొహరాపురం మారెమ్మవ్వ ఆలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

నందవరం: గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ నుంచి మారెమ్మవ్వ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. మొదటి విడతలో రూ.10 లక్షలు, రెండవ విడతలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టగా ఆదివారం పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, డ్రైయినేజీ, తాగు నీటి సౌకర్యాలు కల్పిస్తుడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడాపోటీలు



ఆస్పరిలో కబడ్డీ కోర్టును సిద్ధం చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని గ్రామాలలో ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించే 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడా పోటీల నిర్వహణకు ఆటస్థలాలు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ ఆదివారం తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణకు కోర్టులు సిద్ధం చేశామన్నారు. క్రికెట్‌కు ఆట స్థలాలు అనుకూలంగా ఉన్న ఆస్పరి, కై రుప్పల, బిల్లేకల్, చిన్నహోతూరు, కారుమంచి, పుటకలమర్రి, జొహరాపురం, నగరూరు జిల్లా పరిషత్ హైస్కూళ్ల మైదానాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు కబడ్డీ, 29 నుంచి 30వ తేదీ వరకు వాలీబాల్, జనవరి 2న ఖోఖో, 3న బాడ్మింటన్, 4 నుంచి 6వ తేదీ వరకు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆంజనేయ స్వామికి పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

కోసిగి: రంగప్పగట్టులోని పెండేకల్లు ఆంజనేయస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున నుంచి ఆలయ అర్చకుడు అనంతసేనాస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ఆకుపూజ, ఫలపుష్పాలు, మహామంగళహారతులు, నైవేద్యం సమర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరపున రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ పెద్దలు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, నాడుగేని నాగరాజు, రాముడు, చింతకుంట ఈరన్న, ఆలయ కమిటీ పెద్దలు పి.శివన్న, వెంకటేష్, మూకయ్య పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేత శ్రీరాములుగౌడ్

ఆదోనిరూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐఎస్ఎఫ్ సభ్యులు విజయేంద్ర, థామస్, రంగస్వామి, మునిస్వామి, శ్రీరంగ, దస్తగిరి, అల్తాఫ్ పాల్గొన్నారు.

తీరిన రహదారి సమస్య



నాడు - గతంలో రోడ్డు దుస్థితి



నేడు- వందవాగిలి అంబేడ్కర్ సర్కిల్ నుంచి మసీదు వరకు నిర్మించిన సీసీ రోడ్డు

హొళగుంద: ఎన్నో ఏళ్లుగా వందవాగిలి అంబేడ్కర్ సర్కిల్ నుంచి మసీదు వరకు నెలకొన్న ప్రధాన రస్తా సమస్యను కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పరిష్కరించారు. మంత్రి ఆదేశాలతో సీసీ రోడ్డు నిర్మించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రస్తాలో సీసీ, డ్రైనేజీ లేక బురదకుంటగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. సమస్యను గ్రామస్తులు గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోయ మేలగిరి, నాయకులు జయన్న, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున ఆధ్వర్యంలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో 360 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

చర్చిలు.. చరిత్రకు సాక్ష్యాలు

- 191 ఏళ్ల క్రితం స్థాపించిన రామదుర్గం చర్చి
- చరిత్ర పుటలకెక్కిన ఎం.కొట్టాల చర్చి
- పశ్చిమ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పురాతన కట్టడాలు



రామదుర్గం గ్రామంలో నిర్మించిన మోక్షారోహిణి ప్రార్థనా మందిరం

ఆలూరు రూరల్: క్రైస్తవుల ఆరాధన కేంద్రాలైన చర్చీలకు ఆలూరు నియోజకవర్గంలో ఎనలేని చరిత్ర ఉంది. ముఖ్యంగా బ్రిటీషు కాలంలో నిర్మించిన చర్చీలు నేటికీ చెక్కుచెదరకుండా ఠీవీగా దర్శనమిస్తున్నాయి. 1830 సంవత్సరంలో చిప్పగిరి మండలంలోని రామదుర్గం గ్రామంలో నిర్మించిన చర్చి చరిత్రకు గుర్తుగా నిలిచింది. 193 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉంది. బ్రిటీషు కాలంలో ఫాదర్ వెర్మోలిన్ ఈ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బ్రిటీషు హయాంలో చెన్నై, ముంబై, బెంగళూరు నగరాల నుంచి పాలన సాగించిన అధికారులు ఈ చర్చి ఆవరణలో బస చేసి ఇక్కడి నుంచి పరిపాలన నడిపేవారని చరిత్ర చెబుతోంది. పశ్చిమ భారత దేశంలో జిల్లాలోని చిప్పగిరి మండలంలో 19 దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ క్రైస్తవ మందిరం ఘన చరిత్ర కలిగి ఉండడం విశేషం.

92 ఏళ్ల చరిత్ర కలిగిన ఎం.కొట్టాల ఆర్సీఎం చర్చి

ఆలూరు మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలోని సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) నిర్మించి 91 ఏళ్లు పూర్తయ్యింది. ఈ గ్రామంలో 2,090 ఎకరాల బంజరు భూమిని అప్పటి బ్రిటీషు అధికారులు పేదలకు పంచి పెట్టారు. భూమిని సాగు చేసుకునేందుకు వారు అక్కడే ఇళ్లను నిర్మించుకొని జీవనం ప్రారంభించారు. ఇంటి నిర్మాణాలతో పాటు సీఎస్ఐ చర్చిని నిర్మించుకున్నారు. కొట్టాల గ్రామంలో 230 కుటుంబాలు ఉండగా ఇందులో 205 కుటుంబాలు క్రైస్తవ మతస్తులు కావడం విశేషం. ఇప్పటికీ లండన్ నుంచి ఈ ప్రార్థనాలయానికి నిధులు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వచ్చిన నిధులను చర్చి అభివృద్ధికి ఖర్చు పెడుతున్నారు.




ఎం.కొట్టాలలో 1936లో నిర్మించిన చర్చి

క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు



ఆలూరులో క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన సీఎస్ఐ చర్చి



హాలహర్విలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చి

ఆలూరు రూరల్: లోక రక్షకుడు ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఇందుకోసం అన్ని చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పార్థనలు చేయనున్నారు. పాస్టర్లు దైవ సందేశం అందించనున్నారు. గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ గీతాలు ఆలపిస్తూ పలు చర్చీలలో కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకోనున్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని అన్ని చర్చీలు క్రిస్మస్ శోభ సంతరించుకున్నాయి. వెల్దుర్తి ఏబీఎం, పలు చర్చీలు విద్యుద్దీపాలంకరణలో వెలిగిపోతున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన వేడుకల్లో భాగంగా పలు చర్చీలలో క్రిస్మస్ క్యాండిల్ సర్వీస్ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఏబీఎం చర్చిలో పాస్టర్ ఏసేపు, చర్చి పెద్దల ఆధ్వర్యంలో దాదాపు 150 మందికి వస్త్రదానం చేశారు. ప్రతిఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో చర్చి సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న తెలిపారు.



చర్చి లోపల సుందరంగా అలంకరించిన దృశ్యం

హాలహర్వి: క్రిస్మస్ సందర్భంగా మండలకేంద్రంతో పాటు చింతకుంట, మెదేహాల్, బిలేహాల్ తదితర గ్రామాల్లోని చర్చీలు అందంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలు, రంగురంగుల జెండాలతో సుందరంగా ముస్తాబు చేశారు. నేడు క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయా చర్చీల పాస్టర్లు తెలిపారు.



విద్యుద్దీపాలంకరణలో వెల్దుర్తి ఏబీఎం చర్చి




విద్యుద్దీపాల వెలుగులో ఎస్‌హెచ్ ఎర్రగుడి చర్చి

రేపు సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంతో పాటు నియోజకవర్గంలో మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ముందు వరుసలో ఉండి పోరాడిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ప్రజా సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేసిన సీపీఐ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు చిన్నన్న గిడ్డయ్య,వీరేష్, తిమ్మగురుడు, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత చాటుతున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలిరాగా వారికి పూజారులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.